క్లుప్తంగా

పోటెత్తిన భక్తులు



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు చేరుకుని అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలతో నిరుద్యోగ యువత

ఆమదాలవలస: పట్టణంలోని 18వ వార్డు బొడ్డేపల్లిపేటలో ఉన్న శాఖా గ్రంథాలయానికి అదే వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణరావు తన వంతు సాయంగా పుస్తకాలను ఆదివారం వితరణగా అందించారు. వార్డులో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ పోటీ పరీక్షల నిమిత్తం ఈ పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. సుమారు రూ.4 వేలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. మరింత మంది దాతలు గ్రంథాలయం అభివృద్ధికి సహకరించాలని గ్రంథాలయ అధికారి అంపోలు కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీ



ద్రవ జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ఆమదాలవలస రూరల్: మండలంలో చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లాడ గ్రామంలో చెరుకు పంట కోసం రైతులు సామూహికంగా వెయ్యి లీటర్ల ద్రవ జీవామృతం ఆదివారం తయారు చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ ఎల్టు సురేష్ మాట్లాడుతూ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి కాంపాక్ట్ బ్లాక్ రైతులతో ద్రవ జీవామృతం తయారు చేయించారన్నారు. ఈ జీవామృతాన్ని రైతులు చెరుకు పంటకు ఉపయోగించడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ద్రవ జీవామృతాన్ని ఒకేసారి చెరుకు పంటకు ఇవ్వడం వలన పంటకు అవసరమైన సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయన్నారు. ఫలితంగా సస్యరక్షణకు ఉపయోగపడి మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో ద్రవ జీవామృతం ఉపయోగాలు తెలుసుకొని విరివిగా తయారు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: సైన్స్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 100 రోజుల ప్రత్యేక తరగతుల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు, హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘాన్ని పటిష్టం చేయాలి



భీమారావును సత్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: శిష్టకరణ సంఘాన్ని పటిష్టం చేయాలని, సంఘంలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవాలని భువనేశ్వర్ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు, విశ్రాంత ప్రొఫెసర్ ఆర్.భీమారావు అన్నారు. ఆదివారం నరసన్నపేటకు వచ్చిన ఆయనను స్థానిక శిష్టకరణ సంఘ ప్రతినిధి సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిష్టకరణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ మాట్లాడుతూ భీమారావు ప్రొఫెసర్‌గా ఉత్తమ సేవలు అందించారని, భారత ప్రభుత్వం అనేక పురస్కారాలతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘం నాయకులు మోహనరావు, ప్రభాకరరావు, రఘుపాత్రుని బుజ్జి, అంప్లాం వసంత కుమార్, విజయలక్ష్మి, కస్పా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

- గ్రామస్థాయి స్పందనకు మంగళం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



హిరమండలం సచివాలయం

హిరమండలం: గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతీరోజూ స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో విమర్శలకు తావిస్తోంది.

ప్రతిరోజూ గంట సమయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒక గంట సమయం అవకాశం ఉండేది. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందన కార్యక్రమానికి హాజరయ్యేవారు. గ్రామంలో ఏవిధమైన సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించుకునేవారు. దీనివలన ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండానే సమస్యలు తీరేవి.

పేరుకుపోతున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రజలు మండల కేంద్రాలకు రావాల్సి ఉండడంతో చాలామంది బాధితులు, ప్రజలు వెళ్లలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రాల్లో స్పందన కార్యక్రమాన్ని వారానికి ఒకసారి నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో...					
మండలం	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు	మెళియపుట్టి	ఎల్ఎన్‌పేట
గ్రామ సచివాలయాలు	18	13	27	21	12

మండల కేంద్రాల్లోనే గ్రీవెన్స్

అయితే గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టకపోవడంతో మరలా మండల స్థాయి గ్రీవెన్స్‌కు ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వ్యయ, ప్రయాసలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా గ్రామస్థాయిలోనే గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు



మండల కేంద్రాల్లో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామాల్లోనే స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి. – వంగపల్లి సావిత్రి, వైస్ ఎంపీపీ, హిరమండలం

పునరుద్ధరించాలి



గ్రామాల్లో సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రామస్థాయిలో స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పునరుద్ధరించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. మండల కేంద్రాలకు వెళ్లడానికి వ్యయ, ప్రయాసలు తప్పడం లేదు. – కరణం శివరాం, పింద్రువాడ, హిరమండలం

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..?



ప్రభుత్వ స్థలంలో పెట్టిన షాపు



స్థలానికి కంచె వేసిన దృశ్యం

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేజరు పంచాయతీ నరసన్నపేటలో ప్రభుత్వ స్థలాలు అధికంగా కబ్జాకు గురవుతున్నాయి. వీటిని పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పంచాయతీలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆక్రమణదారులకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా పాత జాతీయ రహదారిపై పైడితల్లి గుడికి వెళ్లేమార్గంలో అవతార్ మెహర్‌బాబా గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వ(రోడ్డు మార్జిన్) స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కూటమి కార్యకర్తలు ప్లాన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే అక్కడ అనధికారికంగా ఒక చిన్నషాపు పెట్టారు. ఇప్పుడు దాని పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కంచె వేశారు. దీంతో విలువైన ఈ స్థలం కబ్జాకు గురవ్వకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆదివాసీల బతుకులు అంధకారం చేయొద్దు



జేవీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

బూర్జ: థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో ఆదివాసీల బతుకులను అంధకారం చేయొద్దని మానవ హక్కుల వేదిక కన్వీనర్ వి.ఎస్.కృష్ణ, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కోరారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టవద్దని కోరుతూ మండలంలోని జె.వి.పురం గిరిజన గ్రామంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో గిరిజన పోరాటానికి ఆదివాసీలు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. ఆదివాసీ గ్రామాల పరిధిలో సుమారు 1,600 ఎకరాలు విస్తీర్ణంలో, రూ.30 వేల కోట్లుతో 3,200 మెగావాట్లు సామర్థ్యం కలిగిన క్రిటికల్ సూపర్ థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలు సరికాదన్నారు. బొగ్గు అధారిత పవర్ ప్లాంట్ వలన ఆదివాసీల పోడు వ్యవసాయం నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలు ఉధృతం చేయక ముందే ప్రభుత్వం పునరాలోచన చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, మానవ హక్కుల ప్రసూన కర్త అనురాధ, జిల్లా కార్యదర్శి సురేష్ దొర, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పాతపట్నం, బైదలాపురం మీదుగా ఒడిశాకు తరలింపు
- పట్టించుకోని అధికారులు




టిప్పర్ మీద పాతపట్నం మీదుగా పర్లాకిమిడి తరలిస్తున్న ఇసుక



ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు

పాతపట్నం: పక్కరాష్ట్రం ఒడిశాకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. పట్టపగలే ట్రాక్టర్లు, టిప్పర్లతో పాతపట్నం, బైదలాపురం మీదుగా పర్లాకిమిడిలోకి తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గడంతో పాటు అవినీతికి పాల్పడుతూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిరమండలం మండలం భగీరథపురం, రుగడ, కొత్తూరు మండలం నివగాం, పొంటూరు గ్రామాల నుంచి వంశధార నదిలో ఇసుకను ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఒడిశాలో ఇసుక ట్రాక్టర్ రూ.4,000 నుంచి రూ.4,500లకు పలుకుతోంది. అదే ఆంధ్రాలో అయితే ఇసుక ట్రాక్టర్ (పాతపట్నం) రూ.1,500 నుంచి రూ.2000లు వరకు ఉంది. దీంతో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోయినప్పటికీ అక్రమంగా హిరమండలం మండలంలోని రుగడ, కొత్తూరు మండలం పొంటూరు గ్రామ సమీపంలో వంశధార నదిలో తవ్వి రవాణా చేస్తున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాకలపాటిని గెలిపిద్దాం



కింతలిలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

పొందూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, మండల శాఖ అధ్యక్షుడు రమణరావులు కోరారు.

ఈ మేరకు మండలంలోని కింతలి, కనిమెట్ట, తోలాపి గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సభ్యులు తేజేశ్వరరావు, విజయకుమార్, రంగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దిగివస్తున్న వెల్లుల్లి



అమ్మకానికి ఉంచిన వెల్లుల్లి

నరసన్నపేట: సామాన్యులకు అందనంత ధరకు చేరిన వెల్లుల్లి ప్రస్తుతం దిగి వస్తోంది. మొన్నటివరకు 250 గ్రాముల ధర రూ.90ల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.30లకు లభిస్తోంది. ఆదివారం నరసన్నపేటలో 500 గ్రాముల వెల్లుల్లి ధర రూ.50లకు హోల్‌సేల్‌గా విక్రయించారు. దీంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ధరలు కొద్దిరోజులు ఉండవచ్చని, మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సోమవారం నుంచి ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతీ గ్రామంలోనూ రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులైన క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. వేతనదారులతో కొలతల ప్రకారం పనులు చేయించి, వారికి కనీస వేతనం దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 80 సీట్లలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 1వ తేదీన హాల్ టిక్కెట్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్షేత్రపాలకునికి కిరణ స్పర్శ



శ్రీమహావిష్ణువు పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని క్షేత్రపాలకుడు శ్రీమహావిష్ణువు పాదాలను మాఘ మాసం ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6.45 నుంచి 6.55 గంటలు వరకూ స్వామివారి పాదాలను తాకగా భక్తులు ఈ దృశ్యాన్ని చూసి ప్రత్యేక పూజలు చేశారు. ఇలా పది రోజుల పాటు పాదాల నుంచి శిరస్సు వరకూ స్వామికి సూర్యకిరణాల స్పర్శ ఉంటుందని అర్చకులు తెలిపారు.

సత్తాచాటిన విద్యార్థులు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఆమదాలవలస: విజయనగరం జిల్లా గరివిడిలో ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన 12వ రాష్ట్రస్థాయి అంతర పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో వెన్నెలవలస పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి.రమణమూర్తి ఆదివారం తెలియజేశారు. ఖోఖో, పెయింటింగ్, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించినట్లు వెల్లడించారు. కళాశాలకు శాశ్వత భవనం లేకపోయినందున ప్రస్తుతం ఆమదాలవలస మండలంలోని దన్నానపేట పాలిటెక్నిక్ కళాశాలలో వీరికి తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

శిథిలావస్థ



సారవకోట మండలంలోని సత్రాం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం ముందరి భాగం పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయి. అలాగే తలుపులు సైతం పాడైపోయాయి. భవనానికి కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో పడిపోయే ప్రమాదం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - సారవకోట

కరకట్టలు నిర్మించరూ..?



ఎల్.ఎన్.పేట మండల పరిధి వంశధార నదీతీరంలో కరకట్టల నిర్మాణాలు ఎప్పుడు చేపడతారోనని తీర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రతిఏటా వంశధార నదికి వస్తున్న వరదలు కారణంగా నదీతీరంలో ఉన్న పంట భూములు, పండ్ల తోటలు కోతకు గురవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఈ వేసవిలో కరకట్టల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - ఎల్.ఎన్.పేట

దాహం కేకలు



మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. చిన్నకోరాడ వీధికి గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా అలికాం – బత్తిలి ప్రధాన రహదారిపై నీటికోసం నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. - హిరమండలం

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు




మాట్లాడుతున్న వైద్యుడు బుడుమూరు రమణమూర్తి

ఆమదాలవలస: వైద్యరంగంలో ప్రస్తుతం అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రముఖ యూరాలజిస్ట్ వైద్యుడు బుడుమూరు రమణమూర్తి అన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జిల్లా సామాజిక గ్రామీణ సంక్షేమ వైద్యుల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో ఏదైనా వైద్యం అందించాలంటే ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం అధునాతన పరికరాలతో లేజర్, లాపరోస్కోపీ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. యూరాలజీకి సంబంధించి కిడ్నీలో రాళ్లు చేరినట్లయితే పక్కలో నొప్పి, వాంతులు, మూత్రం విసర్జనలో కొంత అసౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఆహార నియమాలు పాటించి పగటిపూట నీటిని ఎక్కువగా తాగితే కిడ్నీలో రాళ్లు చేరేందుకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. కిడ్నీలో రాళ్ల తొలగింపునకు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. 90 శాతం రాళ్లను యూరినరీ ట్రాక్ ద్వారా తొలగించవచ్చని చెప్పారు. 50 ఏళ్లు దాటిన వారికి యూరినరీ సమస్యలు వస్తున్నట్లు గుర్తించామన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీలు జాగ్రత్త వహించాలన్నారు. కొత్త వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం వలన గుర్తింపు పొందుతామన్నారు. ఆర్ఎంపీ డాక్టర్లు వ్యాధి గుర్తించి వైద్యం అందించగలిగితే సకాలంలో నయం చేయగలుగుతారన్నారు. కార్యక్రమంలో ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ గురుగుబెల్లి సంధ్య, గ్రామీణ వైద్య సంఘం జోనల్ గౌరవ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు అల్లాడ త్రినాథరావు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.రాజులు, జిల్లా సమన్వయకర్త చౌదరి శ్రీనివాసరావు, వైద్య సంఘం నాయకుడు ఎండ విశ్వనాథం, చింతాడ శ్రీనివాసరావు, ఆమదాలవలస మండల వైద్య సంఘం అధ్యక్షుడు గురుగుబెల్లి రాజు, గ్రామీణ వైద్యుడు దానేటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రొట్టవలసలో సత్సంగం



ప్రసంగిస్తున్న మానసిక వైద్యుడు లక్ష్మణరావు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస శ్రీరామ ఆనందాశ్రమంలో సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్యుడు లక్ష్మణరావు మాట్లాడుతూ.. మానవులు కోరికలు నియంత్రించుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. శాఖాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామి, భక్తులు గోపాలరావు, రెడ్డి గోవిందరావు, జగదీశ్వరరావు, జోగి వెంకటరమణ, డి.రామారావు పాల్గొన్నారు.